సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



2జీ సిమ్‌లతో తిప్పలు
లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్‌ల్లో నమోదు చేసేందుకు అంగన్ టీచర్లు అవస్థలు ఎదుర్కొంటున్నారు. IIలో



దసరాకు ఆర్టీసీ రైట్ రైట్
దసరా పండుగ, సెలవుల వేళ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా నేటి నుంచి ఆర్టీసీ అదనపు సర్వీసులు నడవనుంది. IIలో



వాతావరణం
జిల్లాలో శనివారం ఉదయం నుంచే పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది. కొంతమేర ఎండ తీవ్రత కూడా ఉండవచ్చు.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలోని మూల మూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఎంఆర్‌తో పారదర్శకత

విద్యుత్ ఎస్ఈ మహేందర్



ఏఎంఆర్ మీటర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): హెచ్‌టీ విద్యుత్ వినియోగదారులకు బిల్లులు అందజేయడంలో వేగం, పారదర్శకత పెంచేందుకు ఆటోమెటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) వ్యవస్థను రూపొందించినట్లు ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గొట్టిముక్కుల మహేందర్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. అధిక సామర్థ్యం విద్యుత్ వినియోగించే పరిశ్రమలకు ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మీటర్ రీడింగులను 55 హెచ్‌పీకి మించి సామర్థ్యం ఉంటే ఏడీఈ స్థాయి అధికారి, 55 లోపు హెచ్‌పీ ఉంటే ఏఈ స్థాయి అధికారి స్వీకరిస్తారని వివరించారు. నాన్‌స్లాబ్ రీడింగ్‌ను లైన్ ఇన్‌స్పెక్టర్లు, స్లాబ్ రీడింగ్‌ను ప్రైవేట్, జూనియర్ లైన్‌మెన్లు స్వీకరిస్తారని అన్నారు. ఆటోమెటిక్ మీటర్ రీడింగ్ విధానంతో తప్పులు జరిగే ప్రసక్తే ఉండదని, విద్యుత్ సరఫరాలో వచ్చే హెచ్చు తగ్గులు త్వరితగతిన గుర్తించవచ్చని అన్నారు. ఏఎంఆర్‌లో 4జీ కమ్యూనికేషన్ సిమ్ అమర్చుతామని, దీంతో డేటా హన్మకొండలోని సెంట్రల్ సర్వర్‌కు చేరుతుందని తెలిపారు.

వానొస్తే సెలవే?!

ఇదీ ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీల తీరు



అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో గెలల నిల్వలు

ఒకటి, రెండు రోజులు వర్షం వస్తే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలకు రెండు, మూడు రోజులపాటు సెలవులు ప్రకటిస్తున్నారు. ఇలా ఈ నెలలోనే రెండుసార్లు సెలవులు ఇచ్చారు. ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీల్లో సామర్థ్యం మేరకు గెలల క్రషింగ్ చేయడంలేదని, అందుకే సెలవు ప్రకటించి క్రషింగ్ పూర్తి చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. యంత్రాలను సరైన రీతిలో అమర్చకపోవడంవల్లే ఇలా జరుగుతోందని ఆరోపిస్తున్నారు. మరోవైపు ఫ్యాక్టరీల్లో గెలలు గుట్టలుగా పేరుకుపోయి, వందల సంఖ్యలో ట్రాక్టర్లు బారులుదీరుతుండటంతో రైతులు అవస్థ పడుతున్నారు. –దమ్మపేట

- యంత్రాల క్రషింగ్ సామర్థ్యంపై అనుమానాలు
- అప్పారావుపేటలో స్టెరిలైజర్ అమరికలో లోపం!
- ఫ్యాక్టరీల్లో పేరుకుపోతున్న ఆయిల్‌పామ్ గెలలు
- గెలల లోడ్‌తో బారులుదీరుతున్న ట్రాక్టర్లు

పక్వానికి వచ్చినా వర్షాల సమయంలో తోటలో గెలలు కోయడం వీలుకాదు. దీంతో రైతులు వర్షం తగ్గగానే రైతులందరూ గెలలు కోసి తరలిస్తున్నారు. అశ్వారావుపేట ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యం గంటకు 30 టన్నులు కాగా, గెలల నిల్వలు 1500 టన్నులు దాటగానే ఫ్యాక్టరీకి సెలవు ప్రకటించి గెలలను దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీకి తరలించాలని రైతులకు సూచిస్తున్నారు. దీంతో అక్కడా రెండు రోజుల వ్యవధిలోనే మూడు వేల టన్నుల వరకు గెలలు వచ్చి చేరుతున్నాయి. అప్పారావుపేటలో యంత్రాలు పూర్తిస్థాయిలో క్రషింగ్ చేయడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. వర్షం తగ్గగానే ఒకేసారి గెలలను కోసి తరలించడం, యంత్రాలు పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో ఫ్యాక్టరీల వద్ద ట్రాక్టర్లు వందల సంఖ్యలో బారులుదీరుతున్నాయి. దీంతో రెండు, మూడు రోజులపాటు సెలవు ప్రకటించి, నిల్వ ఉన్న గెలలను క్రషింగ్‌చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

సమస్యకు పరిష్కారం చూపకుండా సెలవులా..?

అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యం గతేడాది గంటకు 90 టన్నులకు పెంచారు. అయినా ఫ్యాక్టరీలో రెండు, మూడు వేల టన్నుల గెలల నిల్వలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఫ్యాక్టరీలకు వచ్చిన గెలలను ఏ రోజుకు ఆ రోజు క్రషింగ్ చేయడంలేదని రైతులు పేర్కొంటున్నారు. దీంతో ఫ్యాక్టరీ నిర్వహణ బాధ్యులు రెండు, మూడు రోజులపాటు సెలవులు ప్రకటించి, నిల్వ ఉన్న గెలలను క్రషింగ్ చేస్తున్నారని చెబుతున్నారు. ఇటీవల వర్షం వచ్చి తగ్గాక ఫ్యాక్టరీలకు గెలలు పోటెత్తాయి. దీంతో ఈ నెల 10, 11 తేదీల్లో రెండు రోజులు, 19 నుంచి 21 వరకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించారు. సమస్యకు పరిష్కారం చూపకుండా సెలవులు ప్రకటించడంపై పామాయిల్ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్టెరిలైజర్ అమరికలో తేడా వల్లే..

అప్పారావుపేట ఫ్యాక్టరీలో క్రషింగ్ సామర్థ్యం 90 టన్నులకు పెంచగా, రూ. 50 కోట్లతో బాయిలర్, స్టెరిలైజర్ యంత్రాలను అమర్చారు. కానీ ఫ్యాక్టరీలో క్రషింగ్ గంటకు 90 టన్నులు జరగడంలేదనే రైతులు ఆరోపిస్తున్నారు. క్షితిజ సమాంతరంగా ఏర్పాటు చేయాల్సిన స్టెరిలైజర్‌ను లంబదిశలో అమర్చడంతో క్రషింగ్ సామర్థ్యం తగ్గిందనే ఆరోపణలు వస్తున్నాయి. 90 డిగ్రీల వ్యత్యాసంలో స్టెరిలైజర్‌ను అమర్చడం వల్ల క్రషింగ్ సామర్థ్యం తగ్గడంతోపాటు క్రూడ్ ఆయిల్ దిగుబడి శాతం కూడా తగ్గుతోందని రైతులు పేర్కొంటున్నారు. రోజుకు 1800 నుంచి 2000 టన్నుల వరకు వేల క్రషింగ్ జరగాల్సి ఉండగా, యంత్రాల అమరికలో తేడా వల్ల 1500 నుంచి 1600 టన్నుల వరకు మాత్రమే అతి కష్టంగా క్రషింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇక అశ్వారావుపేట ఫ్యాక్టరీలో గురువారం అనధికారికంగా క్రషింగ్‌నిలిపివేసినట్లు తెలిసింది. ఫ్యాక్టరీ సామర్థ్యం ప్రస్తుతం గంటలకు 30 టన్నులుకాగా, కనీసం 45 టన్నులకు పెంచాలని రైతులు కోరుతున్నారు.

దిగుమతికి ఆలస్యం..

ఫ్యాక్టరీలకు ట్రాక్టర్లు వందల సంఖ్యలో రావడంతో గెలల దిగుమతికి ఐదు గంటల వరకు సమయం పడుతోంది. యాజమాన్యాలు సెలవు ప్రకటించగానే, ఆ ముందు రోజే రైతులు గెలలను కోసి రాత్రి సమయం వరకు ఫ్యాక్టరీకి పంపుతున్నారు. దీంతో దిగుమతికి పది గంటల సమయం కూడా పడుతోంది. దీంతో వాహనాల డ్రైవర్లు, రైతులు గంటలపాటు వేచి ఉండాల్సివస్తోంది.



అప్పారావుపేట ఫ్యాక్టరీ వద్ద బారులుదీరిన ట్రాక్టర్లు

పనితీరు మెరుగుపడాలి



ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీల్లో యంత్రాలను ఆధునికీకరించి, పనితీరు మెరుగుపర్చాలి. గెలల ఉద్పత్తికి తగినట్టు ఫ్యాక్టరీల సామర్థ్యం పెంచాలి. క్రషింగ్ సామర్థ్యం సరిగా లేపోవడంతోనే వందల సంఖ్యలో ట్రాక్టర్లతో వేచి ఉంటున్నాం.

– సోడెం వెంకట్, ఆయిల్‌పామ్ రైతు, నల్లకుంట, దమ్మపేట మండలం

శాశ్వత పరిష్కారం చూపాలి



ఫ్యాక్టరీలకు తరచుగా సెలవులు ప్రకటించకుండా శాశ్వత పరిష్కారం చూపాలి. యంత్రాలు నిర్దేశించిన సామర్థ్యం మేరకు పనిచేస్తున్నాయా లేదా అనే విషయం పరిశీలించారు. లోపాలు ఉంటే సరిచేసి చేయాలి. అందుకు బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– చెక్కిరాల మల్లేశ్వరరావు, ఆయిల్‌పామ్ రైతు, దమ్మపేట

రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నాం



వర్షం తగ్గగానే ఫ్యాక్టరీలకు గెలలు అధికంగా వస్తున్నాయి. అయినా రైతులకు, డ్రైవర్లకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. వీరి కోసం క్యాంటీన్ కూడా ఏర్పాటు చేశాం. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అశ్వారావుపేట ఫ్యాక్టరీకి వెళ్లాల్సిన గెలలను కూడా అప్పారావుపేటకు తరలిస్తున్నాం. దీంతో అప్పారావుపేట ఫ్యాక్టరీకి గెలల ఉద్పత్తి పెరుగుతోంది. సామర్థ్యానికి మించి, సుమారు మూడు వేల టన్నుల వరకు గెలలు వచ్చిన కారణంగా, ఫ్యాక్టరీలకు సెలవులు ప్రకటించి నిల్వ ఉన్న గెలలను క్రషింగ్ చేస్తున్నాం.

– కల్యాణ్, అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్

భద్రగిరిపై నిర్లక్ష్యమేలా?

- మేడారం, వేములవాడపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- భద్రాచలం అభివృద్ధి పనుల్లో మాత్రం తీవ్ర జాప్యం
- రామాలయ మాస్టర్ ప్లాన్‌పై కదలిక శూన్యం!
- 2027లో జరిగే గోదావరి పుష్కరాలపైనా అదే తీరు



భద్రాచలంలో 2015లో పుష్కరాలకు హాజరైన భక్తులు(ఫైల్)

భద్రాచలం: గిరిజన కుంభమేళాగా భావించే సమ్మక్క, సారలమ్మ జాతర జరిగే మేడారంలో అభివృద్ధి పనులకు ముహూర్తం ఖరారైంది. సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా పనులు ప్రారంభించనున్నారు. రాజన్న కొలువై ఉన్న వేములవాడలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. భద్రగిరి రామయ్య దేవస్థాన అభివృద్ధి పనులు మాత్రం ముందుకు సాగటం లేదు. రోజులు గడుస్తున్నా తుది మాస్టర్ ప్లాన్ సిద్ధం కాలేదు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్లే పనులు పట్టాలెక్కడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం ఎప్పుడో..?

రాష్ట్ర ప్రభుత్వం వేములవాడ ఆలయ అభివృద్ధికి రూ. 100 కోట్లను ప్రకటించి, పనులు చేపడుతోంది. 2026, జనవరిలో జరిగే మేడారం జాతరకు గద్దెల ఆధునికీకరణ, ఇతర అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయటంతోపాటు త్వరలోనే ముఖ్యమంత్రి పనులను ప్రారంభించనున్నారు. కానీ భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం మాస్టర్ ప్లాన్, నిధుల విడుదల మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇటీవల ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి కలెక్టర్, వైదిక కమిటీ, దేవస్థాన అధికారులతో భద్రాచలంలో ఆలయాన్ని పరిశీలించారు. ఆ తర్వాత కూడా కూడా ప్లాన్‌పై స్పష్టత రాలేదు. రూ.350 కోట్లతో దేవస్థానం అభివృద్ధి చేపట్టాలని దేవాదాయ శాఖ నుంచి ప్రతిపాదనలు వెళ్లినా ప్రభుత్వం నుంచి ఆమోదం రాలేదు.

పుష్కరాల పనుల ఊసేలేదు..

పన్నెండేళ్లకోసారి జరిగే గోదావరి పుష్కరాలు మళ్లీ 2027 ఆగస్టులో జరగనున్నాయి. గోదావరి పరీవాహక ప్రాంతంలో భద్రాచలం రామాలయానికి భక్తుల రద్దీ రాష్ట్రంలోనే అత్యధికంగా ఉంటుంది. కోటి మందికి పైగా భక్తులు ఈ సారి పుణ్యస్నానాలు ఆచరిస్తారని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన ప్రణాళికలపై ఇంతవరకు ముందస్తు చర్యలు చేపట్టలేదు. స్నానఘాట్ల సంఖ్య పెంపు, అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, రోడ్ల విస్తరణ, భక్తులకు సర్వ దర్శనం, వీవీఐపీలకు ప్రత్యేక ఏర్పాట్లు తదితర అంశాలపై ముందస్తు మ్యాప్‌లను సిద్ధం చేయాలి. తగిన అంచనాలతో బడ్జెట్ రూపొందించాలి. ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా గత పుష్కరాల్లో పని చేసిన సీనియర్ ఐఏఎస్, ఇతర శాఖల అధికారుల సలహాలు, సూచనలతో పటిష్ట ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. కానీ ఇంతవరకు ఇవేమీ ప్రారంభం కాలేదు.

ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనం

ప్లాన్ రూపకల్పన, బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, విడుదలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రసాద్ పథకం పనులు ఆశించినంత వేగంగా జరగటం లేదు. ఈ నేపథ్యంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని భక్తులు కోరుతున్నారు. రామాలయ అభివృద్ధి, గోదావరి పుష్కరాలకు నిధులను విడుదల చేయాలని వేడుకుంటున్నారు.

ఎస్ఐఆర్ డెస్క్‌వర్క్ పూర్తి చేస్తాం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేష్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డెస్క్ వర్క్ పూర్తి చేస్తామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, కొత్తగూడెం ఆర్డీఓ మధు, ఎలక్షన్ సూపరింటెండెంట్ రంగాప్రసాద్, ఏఈఆర్‌ఓలు దారా ప్రసాద్, పుల్లయ్య, ఎన్నికల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి రెజ్లింగ్‌లో శిక్షణ తరగతులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఏరియా త్రీఇంక్లైన్‌లోని తెలంగాణ క్రీడా మైదానంలో ఈ నెల 21వ తేదీ నుంచి 10 రోజులపాటు రెజ్లింగ్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. కాశీహుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులు రానున్న అక్టోబర్‌లో ప్రారంభం కానున్న స్కూల్ గేమ్స్, సీఎం కప్ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం రెజ్లింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

ఎస్పీ రోహిత్‌రాజు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

ఇల్లెందు: సైబర్ నేరాలకు గురై మోసపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. శుక్రవారం ఆయన ఇల్లెందు డీఎస్పీ కార్యాలయలో తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. క్రైం రికార్డులు, కేసుల నమోదు, పోలీస్ శాఖ పని తీరుపై సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారులు, స్తోమత కలిగిన వ్యక్తులను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఎస్పీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. డీఎస్పీ చంద్రభాను, సీఐలు టి. సురేష్, బి.సత్యనారాయణ, రవీందర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

17 మండలాల్లో భవిత కేంద్రాల నిర్మాణం

టేకులపల్లి: జిల్లాలోని 17 మండలాల్లో నూతన భవిత కేంద్రాల నిర్మాణాలు జరుగుతున్నాయని జిల్లా సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు తెలిపా రు. శుక్రవారం మండలంలోని బొమ్మనపల్లి, బద్దుతండా ప్రాథమిక పాఠశాలల్లో దివ్యాంగుల మరుగుదొడ్లు, టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న భవిత కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పనులు నాణ్యంగా చేపట్టాలన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్ యూసుఫ్, హెచ్‌ఎంలు మోహన్ రావు, పద్మతోపాటు నీరజ, షారోనీ, రవీందర్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ వేతన వెతలు?

- జీతాల చెల్లింపులో రెండు నెలలుగా జాప్యం
- ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్మికుల నిరీక్షణ
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలు



ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న టెక్నికల్ సిబ్బంది



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

చుంచుపల్లి: వేతనాలు సకాలంలో అందక ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామపంచాయతీల్లోనూ అదేతీరు

గ్రామపంచాయతీ కార్మికులకు కూడా రెండు నెలలుగా వేతనాలు రావడంలేదు. జిల్లాలో 471 జీపీల్లో 2,129 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో వాటర్‌మెన్, పారిశుద్ధ్య కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్, కారోబార్, పంపు ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ వంటి విభాగాల్లో పనిచేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు రోజూ తెల్లవారు జామున 5 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 7 గంటల వరకు విధులు నిర్వహిస్తుంటారు. ఒక్కో కార్మికుడికి నెలకు రూ.9,500 చొప్పున ఆన్‌లైన్ ద్వారా నేరుగా వేతనం చెల్లిస్తారు. వీరితోపాటు అత్యవసరాల మేరకు తాత్కాలికంగా పనిచేసే వారికి నెలకు రూ.5 వేలు వరకు చెల్లిస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో 12 నుంచి 15 మంది వరకు, చిన్న పంచాయతీల్లో ఎనిమిది మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సకాలంలో నిధులు రాకపోవడంతో సిబ్బందికి వేతనాలు చెల్లించలేకపోతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ఉపాధి, పంచాయతీ కార్మికులు వాపోతున్నారు. గడిచిన రెండు నెలలుగా ఆర్థిక ఇక్కట్లు తప్పడం లేదని, అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని పేర్కొంటున్నారు. వచ్చే దసరా పండుగ రోజు వరకైనా వేతనాలు అందించాలని కోరుతున్నారు.

ఉపాధి సిబ్బందికీ అంతే..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జిల్లాలో 219 మంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. వీరిలో ఏపీఓలు 21 మంది, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు 21 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు 105 మంది, కంప్యూటర్ ఆపరేటర్లు 72 మంది ఉన్నారు. గతంలో మూడు నెలల చొప్పున జూన్ వరకు వేతనాలు విడుదల చేశారు. జూలై, ఆగస్టు సంబంధించి రెండు నెలల వేతనాలు ఇంతవరకు అందలేదు. ప్రతినెలా వేతనాలకు సంబంధించిన ఎఫ్‌టీఓ జనరేట్ చేసి పంపుతున్నా కానీ జీతాలు అందటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. రాష్ట్ర శాఖలో తగిన బడ్జెట్ లేకపోవడంతోనే వేతనాలు ఆలస్యం అవుతున్నాయని అనధికార సమాచారం. అయితే సాంకేతిక కారణాలతో ఆలస్యమవుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

వేతనాలు విడుదల చేయాలి



ఉపాధి హామీ పథకం సిబ్బందికి ప్రతీసారి వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు సకాలంలో జీతాలు అందుకున్న దాఖలాలు లేవు. అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదు. కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సివస్తోంది. తక్షణమే జీతాలు ఇవ్వాలి. – పిల్లి నాగరాజు, టీఏ, చుంచుపల్లి

రెండు నెలలుగా ఇబ్బంది..



జూలై నుంచి పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించడంలేదు. దీంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. జిల్లా అధికారులను అడిగితే వేతనాలు త్వరలో వస్తాయంటున్నారు. కనీసం దసరా పండుగలోపైనా ఇవ్వాలి.

– డి.అమర్‌నాథ్, జీపీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు

‘సీతారామ’కు గడ్డిపూల సోయగం



సీతారామ కాలువ రోడ్డుకు ఇరువైపులా విరబూసిన గడ్డిపూలు (ఇన్‌సెట్) ప్రధాన కాలువ ఒడ్డున పరుచుకున్న తెల్లపూలు

సీతారామ ప్రాజెక్ట్ కాలువ ఒడ్డున గడ్డిపూలు కనువిందు చేస్తున్నాయి. ప్రధాన కాలువ, సమీప రహదారికి ఇరువైపులా, సమీపంలోని మట్టిగుట్టలపై విరగబూసి ఆహ్లాదం పంచుతున్నాయి. గుబురుగా పెరిగిన గడ్డి, నిలువెత్తు తెల్లటిపూలు, వినీలాకాశం వెరసి ప్రకృతి గీసిన చిత్రంలా ఆకట్టుకుంటున్న ఈ దృశ్యాలు ములకలపల్లి మండలం పూసుగూడెం, మాధారం మధ్య అటవీ ప్రాంతంలో కనిపిస్తున్నాయి. నీటి ఆవాసాలు, వాటి సమీపంలో పెరిగే ఈ పుష్పాలను కొన్ని ప్రాంతాల్లో రెల్లు పూలని పిలుస్తుంటారు. ఏటా ఇదే సమయంలో ఇవి పూస్తాయని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. – ములకలపల్లి

క్లుప్తంగా

కిన్నెరసాని గేటుకు మరమ్మతులు



మరమ్మతులు నిర్వహించిన స్లూయిస్ వెల్

పాల్వంచరూరల్: కిన్నెరసాని జలాశయంలో ఉన్న స్లూయిస్ వెల్ గేటుకు శుక్రవారం మరమ్మతులు నిర్వహించారు. జలాశయం లోపల వైపు ఉన్న స్లూయిస్ వెల్ గేటుకు ఐదు, ఆరు అడుగుల నీటిలోపల బోల్ట్‌లు ఊడిపోయాయి. దీంతో కొత్తగా అమర్చారు. ఈ స్లూయిస్ దిగువ భాగం నుంచి నేరుగా కేటీపీఎస్ కర్మాగారానికి నీటి సరఫరా జరుగుతుంది. మరమ్మతులను ప్రాజెక్టు ఈఈ వెంకటేశ్వరరావు, ఏడీఈ పర్యవేక్షించారు.

ఐక్యతతోనే హక్కుల పరిరక్షణ

పాల్వంచరూరల్: హక్కుల పరిరక్షణ ఉపాధ్యాయుల ఐక్యతతోనే సాధ్యమని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దమ్మగుడి వద్ద శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్, జిల్లా అధ్యక్షుడు పి.నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, అసోసియేట్ అధ్యక్షుడు భాస్కర్, రవీందర్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

బంక్ నిర్మాణంపై మధ్యంతర ఉత్తర్వులు

దమ్మపేట: దమ్మపేట బస్టాండ్ ఆవరణలో నూతన పెట్రోల్ బంక్ నిర్మాణ సంబంధమైన కట్టడాలను తదుపరి విచారణ జరిగే వరకు నిలిపివేయాలని ఆదేశిస్తూ ఈ నెల 15న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బస్టాండ్‌లో బంక్ నిర్మాణం చేపట్టడం వల్ల బస్సుల రాకపోకలకు అడ్డంకిగా మారుతుందని స్థానికులు హైకోర్టులో పిటిషన్ చేశారు. పరిశీలించిన కోర్టు, బస్టాండ్ ప్రాంగణంలో జరుగుతున్న అన్ని కట్టడాలను ఆపి, అన్ని అడ్డంకులను తొలగించి, ప్రజా వినియోగానికి ఉపయోగపడేలా బస్టాండ్‌ను ఉంచాలని ఆదేశించింది.

యజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అశ్వారావుపేటరూరల్: రైతులు యజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడి పొందొచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. శుక్రవారం వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన మండలంలోని నారాయణపురంలో ఆయిల్‌పామ్, వరి పంటలను సందర్శించారు. పంటలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగు, యజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగంతోపాటు సలహాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నాగాంజలి, జంబమ్మ, కృష్ణతేజ, ఝాన్సీ రాణి, కృష్ణతేజ, ఏఈవో షాకిరా బాను, రైతులు పాల్గొన్నారు.

సొసైటీ సీఈఓపై సస్పెన్షన్ వేటు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ప్రాథమిక సహకార సంఘం సీఈఓను ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేసిన ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగు చూసింది. స్థానిక సొసైటీలో సీఈఓగా విధులు నిర్వహిస్తున్న మానేపల్లి విజయ్‌బాబు పలు అక్రమాలకు పాల్పడటంతోపాటు విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్ చేస్తూ ఈ నెల 17న డీసీవో శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. తాత్కాలిక సీఈఓగా కార్యాలయంలో స్టాఫ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డి హేమగిరిని నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మద్యం మత్తులో లారీ డ్రైవింగ్

● పోలీసుల అదుపులో డ్రైవర్

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలోని ఓ ఇసుక క్వారీకి లోడింగ్‌కు వస్తూ మద్యం తాగి అడ్డగోలుగా లారీ నడుపుతున్న డ్రైవర్‌ను స్థానికుల సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల జిల్లాకు చెందిన రాయలింగు శుక్రవారం మున్సిపాలిటీలోని అన్నారం ఇసుక క్వారీకి పూటుగా మద్యం తాగి లారీ నడుపుకుంటూ వెళ్తున్నాడు. ప్రమాదాలకు దారితీసే విధంగా డ్రైవింగ్ చేస్తుండటంతో స్థానికులు లారీ యూనియన్ ఆఫీస్ సమీపంలో లారీని నిలిపి వేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మందుబాబును పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

2జీ సిమ్‌లతో తిప్పలు

మొబైల్స్ యాప్‌లలో వివరాల నమోదులో ఆలస్యం

● ఆవేదన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

● 5జీ ఫోన్లు, సిమ్‌లు అందించాలని విన్నపాలు



అంగన్‌వాడీ కేంద్రం

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలు, లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్‌ల్లో నమోదు చేసేందుకు టీచర్లు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. సరైన ఇంటర్నెట్ వేగం లేకపోవడంతో హాజరు నమోదు, వివరాలు అప్‌లోడ్ చేసేందుకు గంటకు పైగా సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 5జీ స్పీడ్ డేటా వినియోగంలో ఉండగా 2020లో ప్రభుత్వం 2,060 మంది అంగన్‌వాడీ టీచర్లకు 2జీ ఫోన్లను అందించింది. ఆ సెల్‌లో 5జీ సిమ్ వేసినా ఇంటర్నెట్ వేగం లేక తిప్పలు తప్పడం లేదు. రోజా కేంద్రాల కార్యకలాపాలతోపాటు లబ్ధిదారుల హాజరు, సరుకుల వినియోగం వివరాల నమోదుకు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని చెబుతున్నారు.

గంటల తరబడి నిరీక్షణ..

ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో 10–20 మంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందుతోంది. ఈమేరకు యాప్‌ల్లో హాజరు వివరాలు, లబ్ధిదారులకు ఇస్తున్న పోషకాహారం పొందుపర్చాలి. జిల్లాలో మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లు 2,060 ఉండగా,36,600 మంది చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలు నమోదై ఉన్నారు. అయితే, టీచర్లకు ఇచ్చిన సెల్‌ఫోన్లలో ఇంటర్నెట్ వేగంగా లేక హాజరు నమోదు, లబ్ధిదారులకు ఇచ్చే పౌష్టికాహారం వివరాల నమోదుకు ఇబ్బంది ఎదురవుతోంది. వీటికి తోడు నెల, మూడు నెలలకోసారి ఆరోగ్య పరమైన ఎదుగుదల, ప్రీ ప్రైమరీ పాఠశాలల పిల్లల పురోగతిని కూడా నమోదు చేయాల్సి ఉంటుంది. మూడు యాప్‌లో వివరాల నమోదుకు ఇంటర్నెట్ వేగం లేని కారణంగా గంటల తరబడి ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు.

యాప్‌ల వివరాలు..

● న్యూట్రీషియన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం (ఎన్‌హెచ్‌టీఎస్) : ఈ యాప్‌లో ఒక్కో కుటుంబం నుంచి ఎందరు సెంటర్‌కు వస్తున్నారు, అందులో పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఎంత మందో నమోదు చేయాలి. అలాగే, పౌష్టికాహారం పంపిణీ తదితర వివరాలను ఎనిమిది విభాగాల్లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

● పోషణ్ ట్రాకర్ యాప్ : రోజూ టీచర్లు, ఆయాలు, పిల్లలు, తల్లులు, గర్భిణుల హాజరును ఈ యాప్ ద్వారా నమోదు చేయాలి. ఉదయం 9గంటలకు ఒకసారి, సాయంత్రం 4గంటలకు రెండేసి సార్లు హాజరు నమోదుతో పాటు స్నాక్స్ ఏమేం ఇచ్చారో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ యాప్ సెంటర్ ఆవరణలో ఉంటేనే పనిచేస్తుంది.

● ఎర్లీ చైల్డ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) : ప్రీ స్కూల్‌కు సంబంధించిన ఈ యాప్‌లో డిజిటల్ లైబ్రరీ, చైల్డ్ డెవలప్‌మెంట్, బోధన, హెల్ప్‌లైన్, సపోర్ట్ వివరాలు నమోదవుతాయి. మూడు నెలలకోసారి చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదల, ఆరోగ్యం వంటి వివరాలే కాక 0–5 ఏళ్ల చిన్నారులకు బోధన, పోషకాహారం, హాజరు సమాచారం కూడా పొందుపర్చాలి.

2జీ సిమ్‌లతో ఇబ్బంది



అంగన్‌వాడీ సెంటర్లలో జరిగే కార్యక్రమాలను నమోదు చేయాలని మాకు ప్రభుత్వం 2జీ మొబైల్ ఇచ్చింది. కానీ స్పీడ్ ఏ మాత్రం సరిపోవడం లేదు. వివరాల నమోదుకు దాదాపుగా గంట సమయం పడుతోంది. 5జీ సిమ్‌లను అందజేయాలి. – గోనె మణి, అంగన్‌వాడీల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

చాలా సమయం..



2జీ మొబైళ్లలో ఇంటర్నెట్ చాలా నెమ్మదిగా ఉంది. అందరూ ప్రస్తుతం 5జీని ఉపయోగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు, తల్లులు, గర్భిణుల వివరాలు, పోషకాహారం వివరాలను నమోదు చేయాలంటే చాలా సమయం తీసుకుంటోంది.

– శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్, చిట్టి రామవరం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



2 జీ మొబైల్స్, సిమ్‌లతో పడుతున్న ఇబ్బందులను అంగన్‌వాడీ టీచర్లు నా దృష్టికి తెచ్చారు. ఇదే విషయమై ఉన్నతాధికారులకు నివేదించాను. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాను.

– స్వర్ణలత లెనినా, జిల్లా సంక్షేమశాఖ అధికారి

రింగిరెడ్డిపల్లిలో హౌసీ జూదం?

ములకలపల్లి: మండల పరిధిలోని రింగిరెడ్డిపల్లి గ్రామశివారులో హౌసీ(తంబోలా) ఆట విచ్చలవిడిగా సాగుతున్నట్లు సమాచారం. స్థానికంగా కొందరు పోలీసులు సహకారంతో ఈ దందా సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ఆటకు ఒక్కొక్కరి నుంచి రూ.500 నుంచి రూ.1000 వరకూ వసూళ్లు చేస్తున్నట్లు తెలిసింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి జూదరులు పదుల సంఖ్యలో బైక్‌లు, ఆటోల్లో వచ్చి ఆడుతున్నట్లు సమాచారం. ములకలపల్లి శివారులోని వాగు వద్ద, రింగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఇద్దరు వేగులను నియమించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే రెండు రోజులపాటు వరుసగా ఎస్సై మధుప్రసాద్ దాడులు చేపట్టినా జూదరులు చిక్కకుండా పారిపోయారని తెలుస్తోంది. ఈ విషయమై ఎస్సై మధు ప్రసాద్‌ను వివరణ కోరగా.. వరుసగా రెండు రోజులు దాడులు నిర్వహించామని, జూదరులు పరారయ్యారని తెలిపారు.

ఇసుక లారీ బోల్తా



బోల్తా పడిన ఇసుక లారీ

చర్ల: మండలంలోని జీపీపల్లిలో ఇసుక రీచ్ నుంచి లోడుతో వస్తున్న ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా పడింది. శుక్రవారం మొగళ్లపల్లి ఇసుక రీచ్‌లో లోడ్ చేసుకుని వస్తుండగా జీపీపల్లి శివారులో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ మద్యం తాగి నడపడం వల్లే లారీ బోల్తా పడిందని స్థానికులు పేర్కొంటున్నారు.

బీటీపీఎస్ ఉద్యోగి ఆత్మహత్య

పాల్వంచ: మద్యానికి బానిసైన బీటీపీఎస్ ఉద్యోగి శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథన ప్రకారం.. పట్టణంలోని ప్రశాంత్ నగర్ కాలనీకి చెందిన ఉప్పెల్లి పాపారావు(38) మణుగూరులోని బీటీపీఎస్‌లో జేపీఏగా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి 15 సంవత్సరాల క్రితం ప్రవళికతో వివాహం జరిగింది. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా పాపారావు కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం క్షీణించింది. దీంతో విధులకు సరిగా వెళ్లడం లేదు. శుక్రవారం భార్య చర్చికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకున్నాడు. మధ్యాహ్నం వచ్చిన కుటుంబీకులు గమనించి కేటీపీఎస్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి బాబు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్‌లో ఆఫీస్ అటెండెంట్ టీఎస్ గ్రేడ్–హెచ్‌లో 26 ఖాళీలను భర్తీకి యాజమాన్యం శుక్రవారం సర్క్యులర్ జారీ చేసింది. తెలుగులో చదవటం, రాయటం తెలిసినవారు అర్హులని, సంస్థవ్యాప్తంగా పనిచేసే జనరల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

సంక్షిప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీతారాంపురం శివారులోని ముర్రేడు వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై మధుప్రసాద్ తెలిపారు. అనుమతిపత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ సీజ్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు.

బోరువెల్ లారీ ఢీకొని..

● తండ్రీ కొడుకులకు గాయాలు

పాల్వంచరూరల్: బోరు వెల్ లారీ ఢీకొని తండ్రీ కొడుకులు గాయపడ్డ సంఘటన ఇందిరానగర్ పెట్రోల్ బంక్ ఎదుట బీసీఎం రోడ్డుపై శుక్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. దుమ్ముగూడెం మండలం గౌరారం గ్రామానికి చెందిన కె.కాంతయ్య కుమారుడు రవి పాల్వంచలోని హాస్టల్‌లో చదువుకుంటున్నాడు. దసరా పండుగకు హాస్టల్ నుంచి కుమారుడిని ద్విచక్రవాహనంపై ఇంటికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇందిరానగర్ కాలనీ పెట్రోల్ బంక్ ఎదుట బోరువెల్ లారీ ఒక్కసారిగా రోడ్డు మీదకు వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో తండ్రీ కొడుకులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ సురేశ్‌ను వివరణ కోరగా.. ప్రమాదానికి సంబంధించి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

రేపు ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 21న ప్రకాశం స్టేడియంలో ఉమ్మడి ఖమ్మం సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఫుట్‌బాల్ అసోషియేషన్ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈ నెల 25 నుంచి 28 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డ్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామపంచాయతీ ఒంపుగూడేనికి చెందిన గుమ్మడి రాములు (38) మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం రాత్రి మద్యం తాగి భార్య గంగతో ఘర్షణ పడ్డాడు. దీంతో ఆమె సమీప బంధువు ఇంట్లో ఆశ్రయం తీసుకుంది. శుక్రవారం ఉదయం గంగ ఇంటికి చేరుకునే సరికే రాములు ఇంట్లో దూలానికి ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

వివాహిత అదృశ్యం

దమ్మపేట: దమ్మపేటలోని మల్లారం మోడల్ కాలనీలో నివాసం ఉంటున్న ఓ వివాహిత అదృశ్యంపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... కాలనీకి చెందిన నారం రమాదేవి(28) ఈ నెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. రమాదేవి భర్త ముత్యాలరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

తల్లి బంగారం కోసం అన్నదమ్ముల ఘర్షణ

బూర్గంపాడు: తల్లి బంగారం విషయంలో అన్నదమ్ముల కుటుంబాల మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆసుల నాగిరెడ్డి, ఆసుల రామకృష్ణారెడ్డిలు అన్నదమ్ములు. తల్లి వద్ద ఉన్న బంగారం కోసం కొంతకాలంగా గొడవలు పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. దీంతో నాపరాళ్లతో కొట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మేడ ప్రసాద్ కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా జోనల్ క్రీడలు



జూలూరుపాడు: కబడ్డీ ఆడుతున్న బాలికలు



పాల్వంచరూరల్: వాలీబాల్ ఆడుతున్న బాలురు

పాల్వంచరూరల్/జూలూరుపాడు: పాల్వంచ మండలం కిన్నెరసాని గిరిజన క్రీడామైదానంలో శుక్రవారం పాల్వంచ, ములకలపల్లి, బూర్గంపాడు మండలాల జోనల్ క్రీడాపోటీలను నిర్వహించారు. మూడు మండలాల నుంచి 500 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహించారు. వివిధ విభాగాల నుంచి జిల్లాస్థాయి పోటీలకు 356 మందిని ఎంపిక చేశారు. జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చండ్రుగొండ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. జూలూరుపాడు, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లో అండర్–14, అండర్–17 బాలబాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో స్జీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, ఆయా మండలాల ఎంఈఓలు, పీఈటీలు పాల్గొన్నారు.

విద్యా బోధన మెరుగుపడాలి



మల్లెలమడుగులో ఎంఈఓ, టీచర్లతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ

బూర్గంపాడు/అశ్వాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన మరింత మెరుగుపరచాలని ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ, డీఈఓ నాగలక్ష్మి సూచించారు. అంజనాపురం, పినపాక పట్టీనగర్‌లలోని ప్రాథమిక పాఠశాలలను వారు వేర్వేరుగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో నూతనంగా అమలు చేస్తున్న ఏఐ డిజిటల్ క్లాస్‌లను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు సులభతర రీతిలో బోధన జరగాలన్నారు. విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. వసతులను పరిశీలించారు. మల్లెలమడుగు–1 అంగన్‌వాడీ కేంద్రంలో టాయిలెట్‌లో నీటి సౌకర్యం లేకపోవడం, అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీటి సౌకర్యం లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంఈఓ ఎదుసింహరాజు పాల్గొన్నారు.

సింగరేణి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో శుక్రవారం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. 65 ఏళ్ల వయసు మహిళకు ఆపరేషన్ చేసి 8 కిలోల బరువు గల కాంప్లెక్స్ ఓవేరియన్ ట్యూమర్(కణితి)ని తొలగించారు. గైనకాలజీ, అనస్థీసియా, నర్సింగ్, పారా మెడికల్ బృందాలు సమన్వయంతో ఆపరేషన్ విజయవంతం చేశారు. గైనకాలజిస్టులు కాళేశ్వర్, కృష్ణమూర్తి, రవళి శస్త్రచికిత్స నిర్వహించగా, సీఎంఓ డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్, ఏసీఎంఓ ఉష అభినందించారు.



శస్త్రచికిత్స చేసి కణితి తొలగించిన వైద్య బృందం

టీజీఎస్ ఆర్టీసీలో పదోన్నతులు

జాబితాలో శ్రామిక్‌లు, కండక్టర్లు, డ్రైవర్లు, ఏడీసీలు

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లోని వివిధ డిపోల ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. శ్రామిక్‌లు, డ్రైవర్లు, కండక్టర్లు, ఏడీసీలకు పదోన్నతులు కల్పించి నూతన స్థానాలకు బదిలీ చేస్తూ ఆర్‌ఎం సరిరామ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం ఆర్‌ఎంగా సరిరామ్ బాధ్యతలు చేపట్టాక ఉద్యోగులకు పదోన్నతులు లభించడం ఇది రెండోసారి కాగా, కోరుకున్న స్థానాలకు బదిలీ చేయడంపై వారు వ్యక్తం చేశారు. కండక్టర్లు, డ్రైవర్లకు అసిస్టెంట్ డిపో క్లర్క్‌లుగానే కాక ఏడీసీలు, టీఐ–3 ఉద్యోగులు పలువురికి పదోన్నతి లభించింది.

పదోన్నతులు ఇలా...

శ్రామిక్‌లుగా విధులు నిర్వర్తిస్తున్న 14 మందికి హెల్పర్లుగా పదోన్నతి కల్పించారు. సత్తుపల్లి, ఖమ్మం డిపోల నుంచి నలుగురు చొప్పున, భద్రాచలంలో ఇద్దరితో పాటు ఖమ్మం, మధిర, మణుగూరు, ఇల్లెందు డిపోల నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. అలాగే, రీజియన్‌లో 14 మంది మెకానిక్స్, ఆర్టిజన్లకు గ్రేడ్–1 మెకానిక్‌లుగా పదోన్నతి లభించింది. ఇక కండక్టర్, డ్రైవర్లు 14 మందికి ఏడీసీలుగా పదోన్నతి కల్పించారు. ఇందులో ఖమ్మం డిపో నుంచి ఏడుగురు, భద్రాచలంలో ముగ్గురు, కొత్తగూడెంలో ఇద్దరు, సత్తుపల్లి, మణుగూరు నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. అలాగే, ఐదుగురు ఏడీసీలకు డిపో క్లర్క్(డీసీ)లుగా పదోన్నతి లభించింది. మధిరలో ఇద్దరు, ఖమ్మం, సత్తుపల్లి, భద్రాచలం డిపోల్లో ఒక్కొక్కరు ఉన్నారు.

దసరాకు ఆర్టీసీ రైట్ రైట్

నేటి నుంచి ప్రత్యేక బస్సులు

● రీజియన్ నుంచి 17 రోజుల్లో 1,025 సర్వీసులకు ప్రణాళిక

● గ్రామీణ ప్రాంతాల బస్సులపై సందిగ్ధత



ఖమ్మంమయూరిసెంటర్: దసరా పండుగకు సొంత గ్రామాలకు వెళ్లే వారితో పాటు సెలవుల వేళ రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు ఆర్టీసీ ఖమ్మం రీజియన్ అధికారులు కసరత్తు పూర్తిచేశారు. బతుకమ్మ, దసరా పండుగకు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు సొంత గ్రామాలకు వస్తారు. ఈ రద్దీకి అనుగుణంగా ఏయే ప్రాంతాలకు ఎన్ని బస్సులు నడపాలో ప్రణాళిక రూపొందించారు. అయితే, ఈసారి ప్రత్యేకం పేరిట నడిపే అదనపు సర్వీసుల్లో 50శాతం అదనపు చార్జీ వసూలు చేయనున్నారు. అదనపు సర్వీసులన్నీ హైదరాబాద్ రూట్‌లోనే ఏర్పాటు చేస్తుండడంతో డిపోల నుంచి మారుమూల గ్రామాలకు నడిచే బస్సుల సంఖ్య తగ్గనున్నట్లు తెలుస్తోంది. దీంతో హైదరాబాద్, ఇతర పట్టణాల నుంచి జిల్లా, నియోజకవర్గ కేంద్రాల వచ్చేవారు స్వగ్రామాలకు వెళ్లడంలో ఇక్కట్లు ఎదుర్కొనే అవకాశముంది.

పూల పండుగ ప్రత్యేకం

తెలంగాణలో బతుకమ్మ, దసరా పండుగకు ప్రత్యేకత ఉంది. పండుగల సందర్భంగా విద్యాసంస్థలకు ఈనెల 21 నుండి సెలవులు ప్రకటించగా 20వ తేదీ నుండే ప్రయాణికులు స్వగ్రామాలకు బయలుదేరనున్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టాక బస్సుల్లో నిత్యం రద్దీ ఉంటుండడం.. ఇప్పుడు సెలవులతో మరింత పెరగనుండడంతో అధికారులు అదనపు సర్వీసులు నడిపేందుకు సిద్ధమయ్యారు. రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడిపిస్తే, రోజువారీ మార్గాల్లో బస్సుల కొరత ఏర్పడే అవకాశముంది. దీంతో శ్రీశైలం, హన్మకొండ తదితర ప్రాంతాల సర్వీసులను రద్దు చేసి అదనపు సర్వీసుల కింద వినియోగించుకోవాలని భావిస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్ నుండి రీజియన్‌కు రద్దీ ఉంటుందనే అంచనాతో అధికారులు ఈ మార్గంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

1,025 ప్రత్యేక సర్వీసులు

దసరా పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో 1,025 ప్రత్యేక సర్వీసులు నడిపిస్తారు.

ఖమ్మం రీజియన్‌లోని డిపోల వారీగా నడిపే అదనపు సర్వీసులు

డిపో	నాన్ రిజర్వేషన్	రిజర్వేషన్	మొత్తం
ఖమ్మం	161	75	236
మధిర	136	62	198
సత్తుపల్లి	84	75	159
భద్రాచలం	98	65	163
కొత్తగూడెం	69	45	114
మణుగూరు	59	36	95
ఇల్లందు	43	17	60
రీజియన్	650	375	1,025

ఈనెల 20వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్‌కు, అక్టోబర్ 2నుండి అక్టోబర్ 6 వరకు ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు బస్సులు ఉంటాయి. రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు బస్సుల సంఖ్య పెంచేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అలాగే, 24గంటల పాటు నాన్‌స్టాప్ సర్వీసులు తిప్పుతారు. ఇవికాక ఖమ్మం నుంచి మణుగూరు, భద్రాచలం, సత్తుపల్లి, కొత్తగూడెం, మధిర, ఇల్లెందు ప్రాంతాలకు కూడా బస్సులు అందుబాటులో ఉంచుతారు.

ఆర్టీసీ బస్సులను వినియోగించుకోండి



దసరా సెలవుల్లో ప్రయాణికులు సౌకర్యవంతంగా, సురక్షితంగా రాకపోకలు సాగించేలా ఆర్టీసీ తరఫున అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తే గమ్యస్థానాలకు సాఫీగా చేరుకోవచ్చు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుతాం. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉన్నందున ప్రయాణికులు వినియోగించుకోవాలి.

– ఏ.సరిరాం, ఖమ్మం రీజియన్ మేనేజర్

సాక్షి ఫ్యామిలీ IV
ఖమ్మం
శనివారం ॥ 20-9-2025



'రోజంతా ఉత్సాహంగా ఉండడానికి, మనం ఉదయం లేవగానే చేసే పనులు కీలకపాత్ర పోషిస్తాయి. నిద్ర లేచిన కొద్దిసేపటికే నెగటివ్ థాట్స్, చేదు జ్ఞాపకాలు దూసుకు రావచ్చు. అవి మదిలో చేరిన వెంటనే డిలీట్ చేయాలి. ఇష్టమైన సంగీతం వినాలి. వ్యాయమాలు, క్రియేటివ్ వర్క్‌పై దృష్టి పెట్టాలి' అని అంటున్నాడు బ్రూక్. హార్వర్డ్ ప్రొఫెసర్ ఆర్థర్ సి.బ్రూక్‌కి హ్యాపీ సైంటిస్ట్ అని పేరు.

తొలి అడుగు

ఫస్ట్ క్లాస్ జర్నీ





కాస్త సరదాగా చెప్పుకోవాలంటే...

'నువ్వు ఎక్కవలసిన రైలు ఒక జీవితకాలం లేటు' అనే ఆరుద్ర మాట సురేఖ యాదవ్‌కు వర్తించదు.

నిజానికి రైలే ఆమెను వెదుక్కుంటూ వచ్చింది.

ఆసియా ఫస్ట్ ఉమెన్ ట్రైన్ డ్రైవర్‌గా చరిత్ర సృష్టించిన సురేఖ రిటైర్ అయింది.

ఆమె ఒక రైలుబడి. ఆ బడిలో ఎన్నో విలువైన పాఠాలు ఉన్నాయి. భావితరాలకు మార్గదర్శకాలు ఉన్నాయి.

మహారాష్ట్రలోని సతారలో పుట్టి పెరిగింది సురేఖ. అయిదు గురు పిల్లల్లో పెద్దది. తండ్రి రామచంద్ర భోంస్లే రైతు. సతారాలోని సెయింట్ పాల్ కాన్వెంట్ హైస్కూలులో చదువుకున్న సురేఖ వృత్తివిద్యా కోర్సులో చేరింది. ఆ తరువాత.. కరాడ్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా, బీఎస్సీ(మ్యాథ్స్), బీయీడీ చేసింది.

టీచర్ కాదు రైలు డ్రైవర్

బీయీడీ చేసిన సురేఖ టీచర్ కావాలనుకునేది. అయితే ఆమెకు రైల్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే అవకాశం వచ్చింది. ముంబైలో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తి చేసుకొని సెంట్రల్ రైల్వేస్‌లో ట్రైనీ అసిస్టెంట్ డ్రైవర్‌గా చేరింది. 1985లో కల్యాణ్ ట్రైనింగ్ స్కూల్‌లో ఆరు నెలల పాటు శిక్షణ తీసుకుంది. అసిస్టెంట్ డ్రైవర్‌గా ఆమె వృత్తి ప్రయాణం మొదలైంది. వాడి బందర్, కల్యాణ్‌ల మధ్య నడిచే గూడ్స్ ట్రైన్‌లో ఇంజిన్ రన్నింగ్ కండీషన్, సిగ్నల్స్... మొదలైన వాటిని పర్యవేక్షించేది. కొన్ని సంవత్సరాల తరువాత పూర్తిస్థాయిలో గూడ్స్ డ్రైవర్‌గా బాధ్యతలు స్వీకరించింది. ఆ తరువాత వెస్ట్రన్ ఘాట్ రైల్వేస్‌లో డ్రైవర్‌గా పనిచేసింది.

■ దక్కన్ క్వీన్ డ్రైవ్ చేసిన క్వీన్

దక్కన్ క్వీన్(డైలీ పాసింజర్ ట్రైన్) డ్రైవర్‌గా పాసింజర్ ట్రైన్‌ను నడిపిన ఆసియాలోని తొలి మహిళగా గుర్తింపు పొందింది సురేఖ. ఘాట్ లైన్ కోసం రెండు-ఇంజిన్‌ల ప్యాసింజర్ ట్రైన్ నడపడానికి ప్రత్యేక శిక్షణ తీసుకుంది. గతంలో మహిళలు ఎవరూ ఘాట్ లైన్‌లో ట్రెయిన్ నడపక పోవడం వల్ల పై అధికారులకు సందేహాలు ఉండేవి. వాటిని పటాపంచలు చేస్తూ 'శభాష్' అనిపించుకుంది సురేఖ.

'దక్కన్ క్వీన్ ట్రైన్ నడపాలనేది నా కలగా ఉండేది. ఎందుకంటే మహిళ పేరుతో నడిచే రైలు అది. ఆ పేరులో రాజసం ధ్వనిస్తుంది. ఆ కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది. భారతీయ రైల్వే నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు గర్వంగా ఉంది. మహిళలకు ప్రత్యేకించిన ట్రైన్స్‌ను నడపడం కూడా సంతోషంగా ఉంది' అంటుంది సురేఖ.

■ గురువుగా...

ఎక్స్‌ప్రెస్ మెయిల్ డ్రైవర్‌గా 2011లో ప్రమోట్ అయిన సురేఖ ఆ తరువాత కల్యాణ్‌లో డ్రైవర్స్ ట్రైనింగ్ సెంటర్ (డిటీసి)లో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పాఠాలు బోధించింది. మన దేశంలో ట్రైన్ నడిపిన తొలి మహిళగా గుర్తింపు తెచ్చుకున్న సురేఖ ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చింది. 2011లో 50 మంది మహిళలు సబర్బన్, గూడ్స్ ట్రైన్ డ్రైవర్‌లుగా ప్రయాణం మొదలుపెట్టారు. ఇలాంటి ఎంతోమంది మహిళలకు స్ఫూర్తి...సురేఖ.

■ ఆ ప్రోత్సాహమే ఉత్సాహమై...

'ఆడవాళ్ల ట్రైన్ డ్రైవర్ ఏమిటి! అని ఆశ్చర్యపోయే రోజుల్లో కూడా నా కుటుంబం, మిత్రులు, బంధువుల నుంచి ప్రోత్సాహం లభించింది. ఆ ప్రోత్సాహమే ఉత్సాహమై నన్ను ముందుకు నడిపించింది. వృత్తిజీవితంలో నాకు ఎలాంటి వివక్షా ఎదురుకాలేదు. ట్రైన్ ఎక్కిన తొలి క్షణం నుంచి మరే విషయాలు మదిలో రాకుండా ప్రశాంతంగా ఉండేలా చూసుకునేదాన్ని' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది సురేఖ.

నిజానికి ఆమె రైల్వే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. అయితే ఆ ఉద్యోగమే ఆమెను చరిత్రలో గుర్తింపు తెచ్చుకునేలా చేసింది.

కష్టం లేదు... ఎప్పుడూ ఇష్టమే!

'ట్రెయిన్ నడపడం అంటే మాటలా!'లాంటి మాటలు వినిపించినప్పటికీ నేను ఎప్పుడూ భయపడలేదు. చాలా ధైర్యంగా, ఉత్సాహంగా శిక్షణ తీసుకున్నాను. ఈ ఉద్యోగంలోకి ఎందుకు వచ్చానా అని ఎప్పుడూ అనుకోలేదు. ఉద్యోగం ఎప్పుడూ కష్టంగా అనిపించలేదు. కుటుంబ, వృత్తి బాధ్యతలను జాగ్రత్తగా సమన్వయం చేసుకునేదాన్ని.

– సురేఖ యాదవ్

ఘనమైన వీడ్కోలు



సురేఖ యాదవ్ ఫేర్‌వెల్ సెలబ్రేషన్ ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ (సీఎస్‌ఎంటీ)లో ఘనంగా జరిగింది. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన సురేఖ ఆత్మీయులు, స్నేహితులు, బంధువులు, రైల్వే ఉద్యోగులు ఆమె మెడలో పూలమాలలు వేశారు. డోళ్లు వాయిస్తూ నృత్యాలు చేశారు.

'సురేఖ రిటైర్ అయినప్పటికీ... ఆమెలోని శక్తి సామర్థ్యాలు రిటైర్ కావు. అవి ఎప్పుడూ ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాయి' అన్నారు వక్తలు.

వంటిల్లు

అమ్మకు నైవేద్యం

దుర్గామాత పూజలకు అన్నీ సిద్ధం అనుకునేలోపు నైవేద్యాల తయారీ ఎలా- అనే ఆందోళన తలెత్తడమూ సహజం... ఏమేం కావాలి, ఎలా రెడీ చేసుకోవాలో ముందే తెలుసుకుని, ఆచరణలో పెడితే అమ్మవారికి రుచిగా... శుచిగా నైవేద్యాలను సులువుగా సిద్ధం చేసుకోవచ్చు. ఆ వివరాలు ఈ వారం వంటిల్లులో..

పరమాన్నం



కావలసినవి: పెసరపప్పు – 1/2 కప్పు; బియ్యం – 3/4 కప్పు; పాలు – కప్పు; నీళ్లు – 4 కప్పులు; బెల్లం తరుగు – కప్పు; యాలకుల పొడి – అర టీ స్పూన్; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; జీడిపప్పు – పది పలుకులు; కిస్‌మిస్ – గుప్పెడు.

తయారీ: ● పప్పును దోరగా వేయించుకోవాలి ● బియ్యం, పప్పు కలిసి కడగాలి ● కుకర్‌లో కడిగిన బియ్యం, పప్పు, నీళ్లు కలిపి 3 విజిల్స్ వచ్చేవరకు ఉడికించి, దించాలి ● మందపాటి గిన్నెలో బెల్లం తరుగు వేసి వేడిచేయాలి. దీంతో 3–4 నిమిషాల్లో బెల్లం పాకం సిద్ధం అవుతుంది ● కుకర్ విజిల్ వచ్చాక మూత తీసి, అన్నం మెత్తగా స్పూన్‌తో మెదుపుకోవాలి. పాలు పోసి కలపాలి ● ఫిల్టర్ పెట్టి, బెల్లం సిరప్ వడకట్టి, మెత్తగా అయిన అన్నంలో కలపాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని స్టౌపై పెట్టి ఐదు నిమిషాలు ఉడికించాలి. దీంట్లో యాలకుల పొడి వేసి కలపాలి ● విడిగా మరొక మూకుడులో నెయ్యి వేడి చేసి, దాంట్లో జీడిపప్పు, కిస్‌మిస్ వేసి దోరగా వేయించాలి ● నెయ్యిలో వేయించిన జీడిపప్పు మిశ్రమంలో కలిపి, గిన్నెలోకి తీసుకోవాలి.

అల్లం గారెలు



కావలసినవి: మినప్పప్పు – కప్పు; ఉప్పు – 1/3 టీ స్పూన్ (తగినంత); వంట సోడా– చిటికెడు; పచ్చిమిర్చి తరుగు – అర టీ స్పూన్; అల్లం తరుగు – టేబుల్ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; మిరియాల పొడి – పావు టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● మినప్పప్పు కడిగి, 3–4 గంటలసేపు నానబెట్టాలి. నీళ్లు వడకట్టి, ఉప్పు వేసి, మెత్తగా రుబ్బుకోవాలి ● రుబ్బిన పిండిలో పచ్చిమిర్చి తరుగు, ఉప్పు, మిరియాలపొడి, కరివేపాకు తరుగు వేసి కలపాలి ● స్టౌ పై కడాయి పెట్టి, గారెలు వేయించడానికి తగినంత నూనె పోసి, వేడి చేయాలి ● వేళ్లకు నీళ్లు తగిలేలా తడి చేసుకొని, పిండిని కొద్ది కొద్దిగా తీసుకొని, వేళ్లతోనే బాల్స్‌లా చేసుకోవాలి ● నూనె రాసిన ప్లాస్టిక్ షీట్‌పైన పిండి బాల్‌ను కొద్దిగా వేళ్లతో అదిమి, మధ్యలో హోల్ పెట్టాలి ● తయారు చేసుకున్న దానిని కాగుతున్న నూనెలో వేసి, రెండు వైపులా గోధుమ రంగు వచ్చే వరకు ఉంచి, బయటకు తీసి, ప్లేటులో పెట్టాలి.

కదంబం



కావలసినవి: బియ్యం – కప్పు; కందిపప్పు – అర కప్పు; చింతపండు – నిమ్మకాయ పరిమాణం; కూరగాయలు – బీరకాయ, సొరకాయ, గుమ్మడికాయ, బెండకాయ, దొండకాయ, గాజర్, బఠానీ.. మొదలైనవి – 150 గ్రాములు (చిన్న ముక్కలు); పసుపు – పావు టీ స్పూన్; ఉప్పు – తగినంత; సాంబార్ పొడి – 2 టీ స్పూన్లు; నూనె – 2 టేబుల్ స్పూన్లు; ఆవాలు – టీ స్పూన్; ఎండు మిర్చి – 2; ఇంగువు – చిటికెడు; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారీ: ● కందిపప్పు బాగా ఉడికించి, మెత్తగా మెదిపి పక్కనుంచాలి ● మరొక గిన్నెలో బియ్యం మెత్తగా ఉడికించి, వేరుగా ఉంచాలి ● ఒక గిన్నెలో కూరగాయల ముక్కలు, చింతపండు రసం, పసుపు, ఉప్పు వేసి మెత్తగా ఉడికించాలి ● ఉడికిన కూరగాయ ముక్కల్లో సాంబార్ పొడి వేసి బాగా కలపాలి ● మెత్తగా చేసిన పప్పు, అన్నం ఉడుకుతున్న కూరగాయల మిశ్రమంలో వేసి కలపాలి ● ఒక చిన్న పాన్‌లో నూనె వేసి వేడి చేసి, ఆవాలు, జీలకర, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ వేసిన తాలింపును వేసి కలపాలి.

● గిన్నెలోకి తీసిన తర్వాత చివరగా నెయ్యి వేయాలి.



– నారాయణమ్మ,
మీ థాట్ హోమ్ డిలైట్

రీబూట్

స్టైల్ మార్చి సత్తా చాటింది!



వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకం గెలిచి చరిత్ర సృష్టించిన జైస్మిన్ లంబోరియా ప్రయాణం నల్లేరు మీద నడకేమీ కాదు. హరియాణాకు చెందిన జైస్మిన్ కుటుంబాన్ని 'బాక్సర్‌ల కుటుంబం' అంటుంటారు. ఆమె తాత కెప్టెన్ చందర్ బ్యాన్ లంబోరియా రెజ్లర్. బాబాయ్‌లు నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్స్‌గా సత్తా చాటారు. తాతల బాక్సింగ్ నైపుణ్యాల గురించి వింటూ, బాబాయ్‌ల బాక్సింగ్‌ల ప్రతిభను చూస్తూ పెరిగింది జైస్మిన్.

వారి స్ఫూర్తితో బాక్సింగ్‌లోకి అడుగు పెట్టిన జైస్మిన్ తన బుఎత్తు కారణంగా మొదట్లో ఇబ్బంది పడింది. అపజయాలు పలకరించాయి. 'అపజయాన్ని చూసి బాధపడడం కంటే ఆడేవిధానాన్ని మార్చుకుంటే సరిపోతుంది' అని ధైర్యం చెప్పుకొని తన స్టైల్‌ను మార్చుకుంది. ఆ మార్పులలో అతిగా తొందర పడకుండా ఓపికగా ఉండడం కూడా ఒకటి. కొత్త స్టైల్‌తో బంగారు పతకం గెలుచుకుంది.

బ్రెజిల్‌లో జరిగిన 'వరల్డ్ బాక్సింగ్ కప్'కు జైస్మిన్‌ను పంపడానికి నిరాకరించిన బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సైతం స్వర్ణపతకం గెలిచిన సందర్భంగా 'ప్రౌడ్ మూమెంట్ ఫర్ ఇండియా' అంటూ 'ఎక్స్' వేదికగా ఎక్సలెంట్ టెక్నికల్ బాక్సర్ జైస్మిన్ లంబోరియాను ప్రశంసించడం విశేషం.

● సోషల్ మీడియా



తూమక్ తూమక్

సోషల్ మీడియాలో 'తూమక్ తూమక్' అనేది వైరల్ ట్రెండ్‌గా మారింది. కర్మ అనే టీచర్ చిన్న పిల్లలతో కలిసి వేసిన 'తూమక్ డ్యాన్స్' ఆహా అనిపిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోకు 21 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.



టీచర్ వేసిన పాపులర్ ట్రెండ్ స్టెప్స్‌ను చిన్ని స్టూడెంట్స్ పర్‌ఫెక్ట్‌గా అనుసరించి 'వారేవా' అనిపించారు.

'మీరు నమ్ముతారో లేదోగానీ నేను ఈ వీడియోను వంద సార్లు చూసి ఉంటాను' అన్నాడు ఒక యూజర్.

'నా వయసు 26 సంవత్సరాలు. మీ స్కూల్‌లో విద్యార్థిగా మారవచ్చా?' అని సరదాగా అడిగింది ఒక యూజర్.

ప్లేబ్యాక్ సింగర్ నేహా బాషిన్ 'జుట్టి మేరీ' ఆల్బమ్ పాపులర్ అయింది. ఈ పాటలోని తూమక్ స్టెప్స్‌కు ఆన్‌లైన్ లోకం ఫిదా అయింది. గతవారం క్లాస్‌రూమ్‌లో చిన్న అమ్మాయి ఒకరు చక్కని హావభావాలతో వేసిన తూమక్ తూమక్ స్టెప్స్ వీడియో కూడా వైరల్ అయింది.

● నమిత

పట్టుదలే..ముందడుగు





ఢిల్లీలో మెటల్ డిజైనింగ్‌లో మాస్టర్స్ చేసిన నమిత సూరత్‌లో ఎనిమిదేళ్లు ఆభరణాలను డిజైన్ చేసింది. అయితే ఉన్నట్లుండి ఆమె విజయవంతమైన కెరీర్‌ను వదిలి హైదరాబాద్‌కు మారి సామాజిక, పారిశుధ్య సమస్యలపై అవగాహన పెంచుకొని పర్యావరణం కోసం పనిచేస్తోంది. రైల్వేలతో పాటు దేశంలో శానిటేషన్ అవసరం ఉన్న ప్రాంతాలలో బయో డైజెస్టర్ టాయిలెట్‌లను నిర్మించి పారిశుధ్య కార్మికులు, గ్రామీణ మహిళలకు వందలాది ఉద్యోగాలను సృష్టించింది. పర్యావరణం కోసం పనిచేయడానికి ఆసక్తి చూపే అనేక స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాల్లో పాల్గొంది. హెల్త్ కేర్, వాటర్ అండ్ శానిటేషన్ అవార్డుతోపాటు అనేక ప్రశంసలను పొందిన నమిత బంకా కథ ఇది.

'తలపెట్టిన పనిని నూటికి నూరుపాళ్లు పూర్తిచేయడానికి కృషి చేయాలని నమ్ముతాను' అంటారు నమిత. భర్త ఉద్యోగరీత్యా హైదరాబాద్ కు బదిలీ కావడంతో ఇక్కడే సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో వివిధ కోర్సుల్లో చేరారు. దాంట్లో భాగంగా ఇండియన్ రైల్వేలో టెండర్లు వేయడం మొదలుపెట్టారు. తనకున్న పరిచయాల ద్వారా పెద్ద సమస్యలలో ఒకటైన పారిశుధ్యం గురించి తెలుసుకుని, రైల్వేలో టాయిలెట్ తయారీదారులకు లైసెన్సింగ్ ఏజెంట్‌గా పనిచేసి, మార్కెట్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఆ తర్వాత తెలంగాణలోని ఎమ్ఎస్ఎమ్ఇ ఇండస్ట్రియల్ పార్క్ వద్ద శానిటేషన్ నిర్వహణ వ్యవస్థ ఏర్పరిచి, పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీలో రాణిస్తున్నారు. బంకా బయో ప్రైవేట్ లిమిటెడ్‌కు రూపకల్పన చేసి, దానిని సంస్థాగతంగా వెలుగులోకి తీసుకువచ్చారు.

వ్యర్థాల శుద్ధి

మన దేశంలో పారిశుధ్య సమస్యల గురించి నమిత వివరిస్తూ –''గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మంది ప్రజలు బహిరంగంగా మలవిసర్జన చేస్తుంటారు. ఈ పద్ధతి ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుంది. పర్యావరణ సమస్యలను పెంచుతుంది. నీటి కాలుష్యానికి దారితీస్తుంది. మేం టాయిలెట్‌ను మాత్రమే కాకుండా 'ఆన్-సైట్' వ్యర్థాల శుద్ధి సౌకర్యాన్ని కూడా అందిస్తాం. వీటి ట్యాంక్‌లో బయో-డైజెస్టర్‌లు అమర్చి ఉంటాయి. సంప్రదాయ టాయిలెట్‌లతో పోలిస్తే తక్కువ సమయంలో 99 శాతం వ్యర్థాలు కుళ్ళిపోతాయి. సంప్రదాయ సెప్టిక్ ట్యాంకులను బయో-ట్యాంకులుగా మార్చడానికి మేం కృషి చేస్తున్నాం. ఇది మెరుగైన పర్యావరణాన్ని, ఆరోగ్య పరిస్థితులను సృష్టిస్తుంది. రైలు పట్టాలను వ్యర్థ పదార్థ రహిత ట్రాక్‌లుగా మార్చడానికి భారతీయ రైల్వేలకు, కుటుంబాలకు బయో-టాయిలెట్లు, పబ్లిక్- కమ్యూనిటీ, పాఠశాలలు, సంస్థలకు బయో-టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న సెప్టిక్ ట్యాంకులను బయో-ట్యాంకులుగా అప్‌గ్రేడ్ చేస్తున్నాం. సమాజంలో పారిశుధ్యం విషయంలో మహిళలు ఎదుర్కొంటున్న కఠినమైన పరిస్థితి గురించి నాకు తెలుసు. మొదట ఈ విషయంలో రైల్వే అధికారులను సంప్రదించినప్పుడు, రైళ్లలో టాయిలెట్ టెక్నాలజీలను మెరుగుపరచడంలో వారు నాతో సహకరించారు. పారిశుధ్య ప్రమాణాలను పెంచడానికి అక్కడ ఒక బలమైన అవకాశాన్ని చూశాను. తరువాత సమాజం కోసం కూడా దీనిని ఉపయోగించడం ప్రారంభించాను.

ధైర్యంతో పాటు దృఢ సంకల్పమే తోడు

కష్టాలను ఎదుర్కోవడానికి ధైర్యంతో పాటు తలపెట్టిన పని పూర్తిచేయాలనే దృఢ సంకల్పం ఉండాలి. నేను అదే చేశాను. సాంస్కృతిక అడ్డంకులెన్నో నాకు అడ్డంకిగా నిలిచాయి కానీ ఆగిపోలేదు. సమాజం పట్ల నా విధులను సక్రమంగా నిర్వర్తించాలన్న నా సంకల్పం, పారిశుధ్యం, పర్యావరణం పట్ల శ్రద్ధే నన్ను నడిపిస్తున్నాయి. ఔత్సాహిక బృందం నాతో కలిసి రావడం అదృష్టం. మొదట ముగ్గురు సభ్యులతో మొదలుపెట్టాం. 2013 చివరి నాటికి మా సంఖ్య 80కి పెరిగింది. వివిధ విభాగాలతో ఖర్చుతో కూడుకున్న పారిశుధ్య పరిష్కారాలను అందించడానికి కృషి చేస్తున్నాం. సంకల్ప్ సమ్మిట్, యాక్షన్ ఫర్ ఇండియా వంటి కార్యక్రమాలలో పాల్గొన్నాం. అక్కడి అనుభవాలు మమ్మల్ని మేము మరింతగా మెరుగుపరచుకోవడానికి సహాయపడ్డాయి. దీనికితోడు బ్యాంకు క్రెడిట్, ప్రైవేట్ రుణ నిధులు ఉండనే ఉన్నాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ కొన్ని ప్రయోజనాలను అందించింది. ఒక మహిళా వ్యవస్థాపకురాలిగా ప్రతి దశలోనూ మనల్ని మనం నిరూపించుకోవాలి. రకరకాల సామాజిక మనస్తత్వాలనూ దృష్టిలో ఉంచుకోవాలి. అప్పుడే సక్సెస్ సాధించగలుగుతాం'' అని చెప్పారు నమిత.

దేశంలో టాయిలెట్ సౌకర్యం అందుబాటులో లేని ప్రదేశాలలో బయోడైజెస్టర్ టాయిలెట్ల నిర్మాణానికి, తయారీకి, సరఫరాకు నమిత బంకా కృషి చేస్తున్నారు. దాదాపు పది మిలియన్ల మందికి ఆమె సేవలు చేరుకున్నాయి. ఇండియన్ రైల్వేస్, షాపూర్జీ పల్లోంజీ, ఎల్ అండ్ టి, వోకార్డ్ ఫౌండేషన్, తెలంగాణ, ఎ.పి ఎడ్యుకేషన్ – వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇస్రో .. వంటివి బంకా బయోకు ఉన్న ముఖ్యమైన క్లయింట్లు. ఈ కంపెనీ ప్రతిష్ఠాత్మక సంకల్ప్ హెల్త్‌కేర్, వాటర్ అండ్ శానిటేషన్ అవార్డుతో సహా అనేక అవార్డులను గెలుచుకుంది.

● పునరాగమనం



5000 ఏళ్లనాటి ఆట తిరిగి వచ్చింది!

5000 వేల ఏళ్ల క్రితం నాటి ఆట ఒకటి తమిళనాడులో పునరాగమనం చేయడమే కాదు బాగా పాపులర్ అవుతోంది. చోళుల కాలం నాటి ఈ ఆట పేరు... ఆట్య పట్య. శారీరక దారుఢ్యం, ఐక్యతకు అద్దం పట్టే ఈ ఆటను 'నత్రినై' అని కూడా పిలుస్తారు. తమిళ ప్రాచీన సాహిత్యంలో ఈ ఆటకు సంబంధించిన ఎన్నో విశేషాలు కనిపిస్తాయి.

పదిహేనుమందితో రెండు జట్లు ఆడే ఈ ఆట చురుకుదనం, వ్యూహం, క్రమశిక్షణకి గీటురాయిగా నిలిచింది.

పెద్దల నోటి నుంచి ఆట్య పట్య గురించి విన్న యువతరం వేల ఏళ్ల నాటి ఆటకు ప్రాణం పోశారు. తమిళనాడులోని వివిధ జిల్లాలలో యువతరమే కాదు పిల్లలు కూడా ఆట్య పట్య ఆడుతున్నారు. ఈ ఆట ఎలా ఆడాలి అనేదాని గురించి యూట్యూబ్‌లో ఎన్నో వీడియోలు ఉన్నాయి.

బులియన్
(బంగారం 10 గ్రా.; వెండి కిలో)
సెప్టెంబర్ 19న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,14,410	బంగారం (24 క్యారెట్లు)	1,13,500	బంగారం (24 క్యారెట్లు)	1,11,330	బంగారం (24 క్యారెట్లు)	1,13,500	బంగారం (24 క్యారెట్లు)	1,14,050	బంగారం (24 క్యారెట్లు)	1,11,600
బంగారం (22 క్యారెట్లు)	1,07,560	బంగారం (22 క్యారెట్లు)	1,02,050	బంగారం (22 క్యారెట్లు)	1,02,050	బంగారం (22 క్యారెట్లు)	1,05,110	బంగారం (22 క్యారెట్లు)	1,04,930	బంగారం (22 క్యారెట్లు)	1,02,300
వెండి	1,33,500	వెండి	1,33,800	వెండి	1,43,000	వెండి	1,33,800	వెండి	1,33,300	వెండి	1,43,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.